ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



నవంబర్ 4 బుధవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 26 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

WEDNESDAY NOVEMBER 4 2026 | VOL:1 | ISSUE: 26 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సీఎం కీలక ఆదేశాలు

మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు జరపాలి

ముంపు భూముల పూర్తి వివరాలు సిద్ధం చేయండి

పరిహారం నిధులు జాయింట్ అకౌంట్‌లో ఉంచుతాం: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబరు 3: తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్రతో సంప్రదింపులు, ముంపు భూములు, పరిహారం

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: పొంగులేటి

పేదల కష్టాలను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం

రైతులకు బోనస్ ఇచ్చి అండగా నిలిచాం

ఇప్పటికే 74 వేల ఉద్యోగాల భర్తీ

8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

ప్రతి గ్రామంలో భూసర్వేకు చర్యలు

ఖమ్మం జిల్లా, నవంబరు 3 :

గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపద దుర్వినియోగమైందని, ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కష్టాలను పట్టించుకోలేదని ఆరోపించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం

ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరి సాగు చేసే రైతులను నిరుత్సాహపరిచారని, వరి వేస్తే ఉరే అన్న పరిస్థితిని సృష్టించారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా ప్రభుత్వం వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని



ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్



అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును

(మిగతా 2వ పేజీలో..

భారతీయ విద్యార్థులకు బ్రిటన్ బంపరాఫర్.. అర్హత ఉంటే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసా



బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఊరటనిచ్చే ప్రకటన వెలువడింది. ఎంపిక చేసిన అర్హత కలిగిన యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువును రెండేళ్లకు పెంచనున్నట్లు యూకే ప్రభుత్వం ప్రకటించింది. యూనివర్సిటీల నిబంధనల పాటింపు రికార్డు మెరుగ్గా ఉండటంతో పాటు, అక్కడ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయనే ప్రమాణాల ఆధారంగా ఈ అర్హతను నిర్ణయించనున్నారు. ఈ వివరాలను యూకే ప్రభుత్వం బడ్జెట్ పత్రంలో వెల్లడించింది. 2027 జనవరి 1 నుంచి బ్రిటన్‌లో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేసిన సాధారణ అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువు రెండేళ్ల నుంచి 18 నెలలకు తగ్గనుంది. అయితే వలస

(మిగతా 2వ పేజీలో..)

అసెంబ్లీ విస్తరణకు భారీ ప్రణాళిక.. కొత్త భవనాలకు ప్రతిపాదనలు

కొత్త భవనాలు, పరిపాలనా కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు

పార్కింగ్ సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి

పర్యాటక శాఖ, డీజీపీ కార్యాలయ భూముల బదిలీపై పరిశీలన

పచ్చదనానికి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. విస్తరణకు గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాసనసభ, మండలి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచడం, ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు కల్పించడంపై ఈ సందర్భంగా చర్చించారు.

ప్రజాప్రతినిధుల కోసం కొత్త భవనాలు

శాసనసభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్‌తో పాటు కీలక ప్రజాప్రతినిధుల నివాస భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభకు అనుబంధంగా పరిపాలనా భవనాలు, వివిధ రాజకీయ పక్షాల కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం ఏర్పాటు చేసే అంశాలను కూడా పరిశీలించారు. శాసనసభ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరమైన అదనపు సదుపాయాల కల్పనపై సమీక్షించారు.

పార్కింగ్, ప్రాంగణ విస్తరణపై దృష్టి

శాసనసభకు వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతున్న

(మిగతా 2వ పేజీలో..)



కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

- **మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్**
- **చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం**
- **ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ**
- **నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ**
- **ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా

(మిగతా 2వ పేజీలో..)



ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం: సీఎం చంద్రబాబు

అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం

ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న చంద్రబాబు

టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వంతో అంచనాలు

రికార్డు సమయంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ

సహాయక చర్యల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని కితాబు



రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును

(మిగతా 2వ పేజీలో..)

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

దక్షిణ కోస్తాంధ్రపై మురసు తీవ్ర తుపాను ప్రభావం

రానున్న 3 గంటల్లో పలు జిల్లాలకు కుండపోత వర్ష సూచన

ఆకస్మిక వరదలపై లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

పాంగిపార్లే వాగులు దాటవద్దని అధికారుల విజ్ఞప్తి

క్రమంగా బలహీనపడనున్న తుపాను, రాత్రికి తగ్గునున్న గాలులు

దక్షిణ కోస్తాంధ్రపై ప్రభావం చూపుతున్న 'మురసు' తీవ్ర తుపాను కారణంగా రానున్న మూడు గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సం పా దకీయం

విపత్తుల వేళ అప్రమత్తత.. ప్రాణరక్షణకు ముందస్తు సన్నద్ధత!

ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో కచ్చితంగా చెప్పడం సాధ్యం కాకపోయినా.. వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది. భారీ వర్షాలు, వరదలు, తుపానులు, పిడుగులు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు ఒక్కసారిగా ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తాయి. ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా సంభవిస్తుంది. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యం.విపత్తులు పూర్తిగా మన నియంత్రణలో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించుకోవడం సాధ్యమే. ముందస్తు హెచ్చరికలు, ప్రజలకు సరైన సమాచారం, అత్యవసర సేవల సమన్వయం, సురక్షిత ప్రాంతాల గుర్తింపు, సహాయక సామగ్రి సిద్ధం చేసుకోవడం వంటి చర్యలు ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలవు.

హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకూడదు

వాతావరణ శాఖలు, విపత్తుల నిర్వహణ సంస్థలు జారీ చేసే హెచ్చరికలను ప్రజలు తేలికగా తీసుకోకూడదు. భారీ వర్షాలు, తుపానులు, వరదలపై ముందస్తు సమాచారం వచ్చినప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందుగానే ఏర్పాట్లు చేయాలి.వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే సమయంలో వాటిని దాటేందుకు ప్రయత్నించడం ప్రమాదకరం. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించడం, విద్యుత్ స్తంభాలు లేదా తెగిపడిన తీగల సమీపంలోకి వెళ్లడం ప్రాణాపాయానికి దారితీయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.అత్యవసర వ్యవస్థలు బలోపేతం కావాలివిపత్తుల సమయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కీలకం. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమష్టిగా పనిచేయాలి. ప్రతి జిల్లాలో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి కార్యాచరణ రూపొందించాలి.అత్యవసర సమయంలో వినియోగించేందుకు అంబులెన్సులు, రక్షణ పరికరాలు, తాగునీరు, ఆహారం, మందులు, తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు సిద్ధంగా ఉండాలి. విపత్తు సంభవించినప్పుడు సమాచారం అందించేందుకు ప్రత్యేక నియంత్రణ కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి. సహాయక చర్యల్లో జాప్యం జరగకుండా బాధ్యతలను ముందుగానే కేటాయించాలి.

పట్టణ ప్రణాళికలో ప్రమాదాల అంచనా అవసరం

పట్టణాల్లో వేగంగా పెరుగుతున్న నిర్మాణాలు, నాలాల ఆక్రమణలు, చెరువుల పూడిక, నీటి ప్రవాహ మార్గాల మూసివేత వంటి అంశాలు భారీ వర్షాల సమయంలో సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడితే చిన్నపాటి వర్షానికే కొన్ని ప్రాంతాలు నీటమునిగే పరిస్థితి ఏర్పడుతుంది.కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు భౌగోళిక పరిస్థితులు, నీటి ప్రవాహ మార్గాలు, డ్రైనేజీ సామర్థ్యం, పర్యావరణ ప్రభావాలను పరిశీలించాలి. ఇప్పటికే ఉన్న ఆక్రమణలు, ప్రమాదకర నిర్మాణాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. పట్టణాభివృద్ధి అనేది కేవలం భవనాలు, రహదారుల నిర్మాణం మాత్రమే కాదు..

గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ ప్రాంతాల్లో వరదలు, వర్షాభావం, పిడుగులు, అగ్నిప్రమాదాల వల్ల రైతులు, పశుపోషకులు, కూలీలు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంటుంది. పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి. వాగులు, వంకల సమీపంలో నివసించే కుటుంబాలకు ప్రమాద సూచనలు తెలియజేయాలి.గ్రామపంచాయతీ స్థాయిలో అత్యవసర సహాయక బృందాలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ప్రాథమిక రక్షణ, ప్రథమ చికిత్సపై శిక్షణ ఇవ్వాలి.

ప్రజల భాగస్వామ్యమే నిజమైన రక్షణ

విపత్తుల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన పని కాదు. ప్రతి పౌరుడికి ఇందులో బాధ్యత ఉంది. ప్రమాద సూచనలను గమనించడం, అధికారులకు సమాచారం ఇవ్వడం, అత్యవసర నిబంధనలు పాటించడం, బాధితులకు సహాయం చేయడం వంటి చర్యల ద్వారా ప్రజలు కీలక పాత్ర పోషించవచ్చు.విపత్తు వచ్చినప్పుడు ధైర్యం అవసరం.. కానీ అంతకంటే ముందుగా అప్రమత్తత అవసరం. ముందస్తు ప్రణాళికలు, సమర్థమైన అధికార యంత్రాంగం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసినప్పుడే ప్రాణనష్టాన్ని తగ్గించగలం. విపత్తుల కోసం ఎదురుచూసి స్పందించడం కాదు.. అవి సంభవించే ముందే సిద్ధంగా ఉండాలి.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు.చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. “ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

(ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.ప్రస్తుతం ‘మురసు’ తీవ్ర తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఇది బాపట్లకు 40 కి.మీ, ఒంగోలుకు 50 కి.మీ, విజయవాడకు 90 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరుతో పాటు నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ కీలక సూచనలు జారీ చేశారు. “భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి” అని ఆయన స్పష్టం చేశారు. అయితే, ‘మురసు’ తుపాను క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ రోజు రాత్రి నుంచి ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం నుంచి హెచ్చరికలు తొలగించే వరకు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సీఎం కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి)

చెల్లింపులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మహారాష్ట్రతో చర్చలు కొనసాగించాలి

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం సూచించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పత్రాలన్నింటినీ మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ముంపు భూముల వివరాలు సిద్ధం చేయాలి

బ్యారేజ్ నిర్మాణం కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాలపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని సీఎం తెలిపారు. సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని, భూములకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అక్కడి అధికారులకు అందించాలని సూచించారు.

పరిహారం నిధులు జాయింట్ అకౌంట్‌లో

ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిహారం చెల్లింపుల కోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. భూముల సర్వే, పరిహారం చెల్లింపుల విషయంలో స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

అంతర్రాష్ట్ర సమన్వయంతో ప్రాజెక్టు ముందుకు

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలను మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సీఎం ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ ప్రాజెక్టు పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తాజా సమీక్షతో ముంపు భూముల సర్వే, పరిహారం చెల్లింపులు, మహారాష్ట్రతో సంప్రదింపుల అంశాలు ప్రాజెక్టులో కీలకంగా మారాయి.

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: పొంగులేటి

మొదటి పేజీ తరువాయి)

వివరించారు.

మరిన్ని ఉద్యోగాల భర్తీకి హామీ

నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే 74 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని పొంగులేటి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అందించామని మంత్రి వెల్లడించారు. సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

భూముల సర్వేతో రైతులకు భరోసా

రాష్ట్రంలో సుమారు 120 ఏళ్ల క్రితం భూముల సర్వేలు జరిగాయని పొంగులేటి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రతి గ్రామంలో భూముల సమగ్ర సర్వే చేపట్టి, భూమి యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. మ్యాపులతో కూడిన భూసర్వే వివరాలను ప్రతి భూయజమానికి అందించి, ఆధార్ తరహాలో భూదార్ గుర్తింపును కల్పిస్తామని స్పష్టం చేశారు.

అసెంబ్లీ విస్తరణకు భారీ ప్రణాళిక.. కొత్త భవనాలకు ప్రతిపాదనలు

మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పార్కింగ్ సదుపాయాలను విస్తరించి, రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ప్రాంగణ విస్తరణకు అవసరమైన అదనపు స్థలాల లభ్యతపైనా అధికారులు చర్చించారు. ఇందులో భాగంగా పర్యాటక శాఖకు చెందిన భూమితో పాటు డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని శాసనసభ అవసరాల కోసం బదిలీ చేసే అవకాశాలను పరిశీలించారు. ఆయా భూముల లభ్యత, వినియోగ సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పచ్చదనాన్ని కాపాడుతూ అభివృద్ధి

శాసనసభ ప్రాంగణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భవనాల నిర్మాణంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి ప్రమాణాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని స్పష్టం చేశారు. దీంతో ప్రాంగణంలో పచ్చదనాన్ని కాపాడుతూనే ఆధునిక మౌలిక సదుపాయాలు, రవాణా, పార్కింగ్ వ్యవస్థలను సమన్వయం చేసేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ మాస్టర్ ప్లాన్ అమలైతే శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలకు కొత్త రూపురేఖలు రానున్నాయి.

భారతీయ విద్యార్థులకు బ్రిటన్ బంపరాఫర్.. అర్హత ఉంటే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసా

మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను పక్కాగా పాటించే, తమ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసినవారికి మాత్రం రెండేళ్ల వీసా ఇవ్వాలని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో యూనివర్సిటీ అర్హతను బట్టి చదువు తర్వాత బ్రిటన్‌లో ఉండే గడువు మారనుంది.చదువు పూర్తయిన తర్వాత బ్రిటన్‌లోనే ఉండి ఉద్యోగ అనుభవం సంపాదించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంలో చదువు తర్వాత పని చేసే అవకాశం కీలకంగా మారిందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇకపై యూనివర్సిటీ ఎంపికలో ర్యాంకింగ్స్‌తో పాటు ఆ సంస్థ నిబంధనల పాటింపు, విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడంలో దాని పనితీరును కూడా పరిశీలించాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. మరోవైపు, ప్రపంచంలోని టాప్ 150 యూనివర్సిటీల్లో అర్హత కలిగిన డిగ్రీలు పొందిన వారికి వర్తించే హై పొటెన్షియల్ ఇండివిడ్యువల్ వీసా పరిధిని కూడా బ్రిటన్ విస్తరించింది. ఈ పథకం కింద వీసాల సంఖ్యను కూడా పెంచనుంది. అయితే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసాకు సంబంధించి ‘హై కాంప్లయన్స్ యూనివర్సిటీ’, ‘మెరుగైన ఉద్యోగ ఫలితాలు’ వంటి అర్హతలను ఎలా నిర్ణయిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నిబంధనలు పారదర్శకంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

ఆయన వివరించారు.తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు. “ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. ‘అవేర్’ (ూఖ్ఔూ=ఱు) వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది” అని చంద్రబాబు పేర్కొన్నారు.ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు.విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. “సాధారణంగా ఇంతటి నష్టాన్ని పూడ్చడానికి కనీసం 20 రోజులు పడుతుంది. కానీ పక్కా ప్రణాళికతో కేవలం 4 నుంచి 5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టగలిగాం” అని చంద్రబాబు వివరించారు.విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేశారని సీఎం ప్రశంసించారు. కుండపోత వర్షంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారని, కూలిన చెట్లను తొలగిస్తూనే స్తంభాలు వేశారని గుర్తుచేశారు. ఆక్వా చెరువుల్లో పడిపోయిన స్తంభాలను సైతం తిరిగి నిలబెట్టారని, ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ మిషన్లను వినియోగించామని వివరించారు. ఈ సహాయక చర్యల్లో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని చంద్రబాబు అభినందించారు. మొత్తం మీద, ముందస్తు అంచనాలు, టెక్నాలజీ వినియోగం, అధికార యంత్రాంగం సమన్వయం, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే తుపానుల ప్రభావాన్ని వీలైనంత త్వరగా అధిగమించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రతి ఓటు విలువను కాపాడటమే లక్ష్యం.. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పోరాటం

- **ఓటు హక్కు పరిరక్షణకు సమిష్టి ఉద్యమం.. ఎన్నికల సంఘం జవాబుదారీతనం వహించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హుజూర్ నగర్, నవంబర్ 3(ప్రజానేస్తం జ్వాల):

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు.. ఆ ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న పోరాటం దేశ ప్రజాస్వామ్య ప్రస్థానంలో కీలక ఘట్టమని అభివర్ణించారు.ఎన్నికల జవాబుదారీతనం, ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై విదుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం కలగాలని, ప్రతి ఓటు నిష్పక్షపాతంగా లెక్కించబడుతుందనే భరోసా ఉండాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాల్లో పారదర్శకతే కీలకం

ఓటర్ల జాబితాల్లో తప్పులు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ఆందోళనలు, ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో పక్షపాత ధోరణి ఉందనే ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదని పేర్కొన్నారు.అర్హులైన ఓటర్లకు న్యాయం జరిగేలా అభ్యంతరాలు, సవరణలకు సులభమైన విధానం ఉండాలని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగాలని సూచించారు.

ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చిన ఉద్యమం

ఎన్నికల జవాబుదారీతనం అనే కీలక అంశంపై ఇండియా కూటమి పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. విభిన్న రాజకీయ నేపథ్యాలు, ప్రాంతీయ ప్రయోజనాలు కలిగిన పార్టీలను ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంతో సమీకరించడం నాయకత్వానికి నిదర్శనమన్నారు.ఎన్నికల ప్రక్రియపై



ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యంపై దాడి కాదని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో భాగమని వ్యాఖ్యానించారు.

ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం

ప్రజాస్వామ్య సంస్థలు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ జాతీయ రాజకీయ ప్రాధాన్యత పెరుగుతోందని, భవిష్యత్తులో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే దేశ రాజకీయ భవిష్యత్తును అంతిమంగా నిర్ణయించేది ప్రజలేనని స్పష్టం చేశారు. ప్రతి ఓటు కీలకం.. ప్రతి ఓటరు హక్కు అమూల్యం. ప్రజాస్వామ్య పరిరక్షణకు పారదర్శక ఎన్నికలే మార్గమనే సందేశాన్ని మంత్రి తన ప్రకటన ద్వారా పునరుద్ఘాటించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి!

- **రైతులు, పేదల సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి: సీపీఎం నేత అల్వాల వీరయ్య**

కురవి ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలను బలోపేతం చేయాలని అన్నారు.మంగళవారం కురవి మండల కేంద్రంలో నల్లపు సుధాకర్ అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో వీరయ్య మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పత్తికి క్వింటాకు రూ. 12 వేల మద్దతు ధర ఇవ్వాలని, రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.అర్హులైన పేదలందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, మొదటి విడతలో మంజూరైన ఇళ్లకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అర్హత ప్రకారం పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు.గ్రామాల్లో అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అంబేద్కర్ అభయహస్తం పథకం కింద దళిత, గిరిజన యువకులకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే



కరువు నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, రైతులు సంఘటితమై ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పిట్టల వెంకన్న, మండల నాయకులు నల్లపు సుధాకర్, గంధసిరి శ్రీనివాస్, కడియం సత్యం, కట్ల కృష్ణయ్య, పోతిగంటి మల్లయ్య, జక్కుల మల్లయ్య, తగరం తిరుపతి, నాలం వెంకన్న, మాలోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ఫోకస్.. పార్టీ శ్రేణులకు ఎర్రబెల్లి దిశానిర్దేశం

- **అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి: బీఆర్ఎస్**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి విమర్శలు.. కేసీఆర్ పాలనతో పోలిక**

పర్వతగిరి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.మంగళవారం పర్వతగిరి మండల కేంద్రంలోని తన నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ఓటరు నమోదు పురోగతిని సమీక్షించి, గ్రామాల వారీగా పట్టభద్రులను గుర్తించి నమోదు కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎర్రబెల్లి విమర్శలు

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శలు చేశారు. విద్యుత్ కోతలు, దేవాదుల ప్రాజెక్టు పంపుల నిర్వహణ, మోటార్ల మరమ్మతులకు నిధుల కొరత వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సేవలను అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.కరోనా



సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు తాగునీరు, విద్యుత్ తదితర అత్యవసర సేవలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణలో భూముల ధరలు, రాష్ట్ర అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.చివరగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా కృషి చేయాలని ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వ్యవసాయ అధికారి!

- **ఫెర్టిలైజర్ షాపు నిర్వహణకు రూ.30 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణ**
- **కార్యాలయంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

సంగారెడ్డి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో మరో ప్రభుత్వ అధికారి చిక్కారు. ఎరువుల దుకాణం నిర్వహణకు ఇబ్బందులు కలగకుండా చూస్తానంటూ లంచం డిమాండ్ చేసి, మిగిలిన రూ. 20 వేల నగదు తీసుకుంటుండగా సదాశివపేట మండల వ్యవసాయ అధికారి జి. రమేష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి అల్లుడు నిర్వహిస్తున్న ఎరువుల దుకాణం వ్యాపారానికి ఆటంకాలు కలగకుండా చూస్తానంటూ ఏవో రమేష్ మొత్తం రూ. 30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో



భాగంగా గత అక్టోబర్ 19న రూ. 10 వేలు ముందస్తుగా తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మిగిలిన రూ. 20 వేల నగదును మంగళవారం తన కార్యాలయంలో స్వీకరిస్తుండగా ముందస్తు సమాచారంతో అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తూ అక్రమంగా లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏవో రమేష్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని రెండో అదనపు ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

ఆపదలో ఉన్న వార్డు వాసికి అండగా కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి

- **సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేస్తానని హామీ**

హుజూర్‌నగర్, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ప్రజాప్రతినిధుల బాధ్యతని చాటుతూ హుజూర్‌నగర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 25వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి మానవీయతను చాటుకున్నారు.సీతారాం నగర్‌లోని 25వ వార్డుకు చెందిన పోలా నరసింహారావు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కౌన్సిలర్ సంపత్ రెడ్డి మంగళవారం స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.బాధితుడికి ధైర్యం చెబుతూ, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం త్వరగా అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, అవసరమైన సమయంలో అండగా నిలుస్తామని కౌన్సిలర్ భరోసా ఇవ్వడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వార్డు నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బడిలో మద్యం తాగి విధులకు హాజరవుతున్న హెచ్ఎం!

- **మూడు రోజులుగా ఇదే పరిస్థితి.. విద్యార్థుల ఆరోపణలు**
- **విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్**



తిర్యాణి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేటలోని ఎంపీయూపీఎస్ (వీఖూ) పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారని విద్యార్థులు ఆరోపించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విద్యార్థులు తెలిపినట్లు సమాచారం.విషయం తెలుసుకున్న గ్రామస్థులు పాఠశాలకు చేరుకుని, సర్పంచ్‌తో కలిసి ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాల క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు.విద్యార్థులు చేసిన ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించి, తప్పిదం రుజువైతే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిత్రుడు దూరమైన కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి స్నేహితులు..

- **మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం..**

భీమదేవరపల్లి, నవంబర్ 3 ప్రజా నేస్తం జ్వాల):



స్నేహబంధానికి ప్రతీకగా పదో తరగతి స్నేహితులు తమ మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాల్వ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయనతో పదో తరగతి చదువుకున్న స్నేహితులు మంగళవారం రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మిత్రుడి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో అంబాల అనిల్, గిద్దె అజయ్, వొల్లాల హరీష్, మహేశా రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, విద్యా సామగ్రి పంపిణీ

- **విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా: ఎంఈఓ వీరస్వామి**
- **సర్కారు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ వీరభద్రరావు**

కూసుమంచి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించి, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యార్థులకు పలు సంక్షేమ సదుపాయాలను కల్పిస్తోందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో అందిస్తున్న ఉచిత విద్యా సామగ్రి, యూనిఫామ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, సాక్సులు, ఐడీ కార్డులు, బెల్టులు, యూనిఫామ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు, మండల విద్యాశాఖాధికారి రావెళ్ల వీరస్వామి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ రావెళ్ల వీరస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే పునాది అని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. విద్యా సామగ్రి, యూనిఫామ్‌ల పంపిణీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు చదువుపై మరింత ఆసక్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

33 కేవీ విద్యుత్ తీగలు తగిలి యువకుడి దుర్మరణం!

- బంతి కోసం ఇంటిపైకి వెళ్లగా విద్యుదాఘాతం.. అక్కడికక్కడే మృతి
- బండ్లగూడలో విషాదం.. కుటుంబంలో తీరని శోకం

పటాన్‌చెరు, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



ఆటలో భాగంగా బంతిని తీసుకునేందుకు ఇంటి పైకప్పుపైకి వెళ్లిన ఓ యువకుడు 33 కేవీ విద్యుత్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘోర ప్రమాదం కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీ కాలనీ డివిజన్ బండ్లగూడ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అన్నదమ్ములు పురుషోత్తం, రఘువంశ్ కుమార్ బండ్లగూడలో నివాసముంటూ స్థానిక పారగాన్ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు అన్న పురుషోత్తం విధులకు వెళ్లగా, తమ్ముడు రఘువంశ్ ఇంటి వద్దే ఉన్నాడు.ఉదయం 9 గంటల సమయంలో స్నేహితులతో ఆటలాడుతుండగా బంతి ఇంటి పైకప్పుపై పడింది. దానిని తీసుకునేందుకు పైకి వెళ్లిన రఘువంశ్‌కు అక్కడ ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అతడి అన్న పురుషోత్తంకు సమాచారం అందించారు. చేతికందిన తమ్ముడు విద్యుదాఘాతంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోడల్ కాలనీ ఇళ్ల కేటాయింపుల్లో అనర్హులకు చోటివ్వొద్దు

- నిజమైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేయాలి.. అర్హులందరికీ మరో అవకాశం కల్పించాలి
- అధికారులకు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి

హుజూర్‌నగర్, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



మోడల్ కాలనీలో ఇళ్ల కేటాయింపులు పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరగాలని, అర్హులైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేయాలని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న నిజమైన పేదలకు అన్యాయం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రకటించిన 1,434 మంది అర్హుల జాబితాతో పాటు అరుణ జాబితా విడుదల అంశంపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మోడల్ కాలనీలో ఇళ్ల కేటాయింపులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. జాబితాల్లో పేర్లు లేకపోయినా అర్హత కలిగిన పేదలకు తమ అర్హతను నిరూపించుకునేందుకు మరో అవకాశం కల్పించాలని ఆర్డీవోను కోరారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, సొంత ఇల్లు లేని నిరుపేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి అక్రమాలకు, అన్యాయాలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రౌడీషీటర్ సూరి హత్య కేసులో ప్రతీకారం: ప్రధాన నిందితుడి హత్యకు కుట్ర పన్నిన ఐదుగురి అరెస్ట్!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



వరంగల్ నగరంలో సంచలనం సృష్టించిన రౌడీషీటర్ దాసరి సురేందర్ అలియాస్ సూరి హత్యకు ప్రతీకారంగా సాగాల్సిన మరో ఘోర హత్యాయత్న కుట్రను హైదరాబాద్ ఎల్బీనగర్ ఎస్వోటీ (ఝా) పోలీసులు చాకచక్యంగా భగ్నం చేశారు. సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అర్బాజ్‌ను హతమార్చేందుకు పన్నిన పక్కా పథకాన్ని పోలీసులు ఛేదించారు.నెక్కొండ మండలానికి చెందిన సూరి ప్రధాన అనుచరుడు ఈ పథక రచనలో కీలకంగా వ్యవహరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్రతో సంబంధమున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 2 దేశవాళీ తుపాకులు, 8 రౌండ్ల తూటాలు, వేటకొడవళ్లు, వాహనాలు మరియు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీఎన్‌పీడీసీఎల్ లోకల్ కోర్టులు: సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (TGNPDCL) పరిధిలోని వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు నవంబర్ 5 నుండి 20వ తేదీ వరకు ఆరు ప్రధాన ప్రాంతాల్లో లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ మాధవరావు వెల్లడించారు.ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా కొత్తకొండ రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ వేదికగా నవంబర్ 5న ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ప్రత్యేక అదాలత్ జరగనుంది. అదనపు విద్యుత్ బిల్లులు, లోపభూయిష్ట మీటర్లు, లో-వోల్టేజీ తదితర సమస్యలపై వినియోగదారులు నేరుగా హాజరై ఫిర్యాదులు సమర్పించవచ్చని ఆయన సూచించారు.

జనగామ MEO కార్యాలయంలో RTI చట్టం అమలేది

- సెక్షన్ 4(1)(బి) సమాచారం ప్రజలకు అందుబాటులో ఉందా
- PIO, మొదటి అప్పీలేట్ అధికారి వివరాలు ఎక్కడ? కలెక్టర్, ణజూ స్పందించాలంటున్న ప్రజలు

జనగామ, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం--2005 జనగామ మండల విద్యాశాఖాధికారి (MEO) కార్యాలయంలో ఎంతవరకు అమలవుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు సమాచారం అందించాల్సిన బాధ్యత కలిగిన కార్యాలయంలోనే RTI చట్ట నిబంధనల అమలుపై స్పష్టత లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల విధులు, అధికారుల బాధ్యతలు, సిబ్బంది వివరాలు, బడ్జెట్, ప్రజా సమాచార అధికారి (PIO), మొదటి అప్పీలేట్ అధికారి తదితర వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే జనగామ వీజూ కార్యాలయంలో ఈ వివరాలు ప్రదర్శిస్తున్నారా? RTI అవగాహన బోర్డు ఏర్పాటు చేశారా? చట్టం నిర్దేశించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన విద్యాశాఖ కార్యాలయాల్లోనే నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. RTI చట్టం అమలు అధికారులకు అదనపు భారం కాదని, అది చట్టబద్ధమైన బాధ్యత అని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి (DEO), జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి జనగామ వీజూ కార్యాలయంలో RTI చట్టం అమలు తీరుపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన లేదా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.చట్టాన్ని అమలు చేయాల్సిన కార్యాలయాల్లోనే దాని అమలుపై ప్రశ్నలు తలెత్తితే సామాన్య ప్రజలకు పారదర్శక పాలన ఎలా అందుతుంది? ¬× చట్టం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పటిష్టంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పన్ను వసూళ్ల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న ఆదేశం!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలో ఆస్తిపన్ను, నీటిపన్ను వసూళ్ల నిర్దేశిత వార్షిక లక్ష్యాలను అధికారులు నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని కమిషనర్ తి. వెంకన్న ఆదేశించారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సర్కిళ్ల వారీగా పన్ను వసూళ్ల పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా దీర్ఘకాలిక పన్ను బకాయిలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, విస్తృత ప్రచారంతో వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇన్‌ఛార్జ్ అదనపు కమిషనర్ సమ్మయ్య, ఉప కమిషనర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ నగర అభివృద్ధి ప్రాజెక్టుల డీపీఆర్‌లపై కేంద్ర అధికారుల సమీక్ష: వివరాలు వెల్లడించిన కలెక్టర్!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి : మారెల్లి కిరణ్):



ప్రతిష్టాత్మక 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద వరంగల్ ట్రైసిటీ పరిధిలో చేపట్టనున్న భారీ అభివృద్ధి పనుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలపై (DPR) కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంగళవారం జరిగిన ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగర ప్రాజెక్టుల వివరాలను సమగ్రంగా వివరించారు. వరంగల్ నగరంలో వరద నివారణకు సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ నెట్‌వర్క్, ఖిలా వరంగల్ కోట పరిరక్షణ-సౌందర్యీకరణ, బస్టాండ్ ఆధునీకరణ, హనుమకొండ చౌరస్తా విస్తరణ మరియు రద్దీ నివారణకు మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్ర బృందానికి వివరించినట్లు తెలిపారు.

రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత అధికారులదే: కిషన్‌రావు!

హనుమకొండ,నవంబర్ 03(ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



వ్యవసాయ మార్కెట్లకు పంటలను తీసుకొచ్చే అన్నదాతలకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కేలా చూడాల్సిన పూర్తి బాధ్యత మార్కెట్ అధికారులపైనే ఉందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్‌రావు స్పష్టం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులకు సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.మార్కెట్ యార్డుల్లో వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టి, పారదర్శక పద్ధతిలో బహిరంగ వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు. తేమ శాతం పేరిట కోతలు విధించకుండా రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ నగర్ పేదల భూములు లాక్కోవద్దు: కలెక్టర్‌కు ప్రజా సంఘాల జేఏసీ వినతి



హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల):

కాజీపేట మండలం వైఎస్సార్ నగర్ కాలనీలో నిరుపేదల భూములను బలవంతంగా లాక్కోవడం తక్షణమే ఆపాలని, గుడిసెవాసులకు సంపూర్ణ న్యాయం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులను నిత్యం భయభ్రాంతులకు గురిచేస్తూ, భౌతిక దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ కోరారు. పేద ప్రజల ఆవాసాలకు రక్షణ కల్పిస్తూ జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

కేయూ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):

చారిత్రక కాకతీయ విశ్వవిద్యాలయ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కేయూలో ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించాలని ఈ సందర్భంగా కోరారు. వర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని నేతలు భరోసా ఇచ్చారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్తకొండలో ప్రత్యేక సమావేశం

భీమదేవరపల్లి, నవంబర్ 3 (ప్రజా నేస్తం జ్వాల):

విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం నవంబర్ 5న గురువారం కొత్తకొండలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్--1 వరంగల్ చైర్‌పర్సన్ కె. మాధవరావు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొత్తకొండ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో సమావేశం జరుగుతుందన్నారు. భీమదేవరపల్లి, కొత్తకొండ, వేలేరు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులు, మీటర్లు, కనెక్షన్లు, సరఫరా అంతరాయాలు తదితర సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన పత్రాలను వెంట తీసుకురావాలని, గ్రామాల్లోని సామూహిక విద్యుత్ సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించాలని ఆయన కోరారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కొత్తకొండ వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.4.57 లక్షలు..

- 398 గ్రాముల వెండి,
- 600 మిల్లీగ్రాముల బంగారం.. మూడు విదేశీ కరెన్సీ నోట్లు

భీమదేవరపల్లి, నవంబర్ 3 (ప్రజా నేస్తం జ్వాల):



ప్రముఖ పుణ్యక్షేత్రమైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.4,57,235 ఆదాయం సమకూరింది. భక్తులు స్వామివారిపై తమకున్న భక్తితో సమర్పించిన కానుకల ద్వారా ఈ ఆదాయం లభించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో పి. కిషన్ రావు పర్యవేక్షణలో పరిశీలకులు పి. ప్రసాద్ సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.4,28,047 నోట్లు, రూ.29,188 నాణేలు లభించాయి. వీటితోపాటు 398 గ్రాముల మిశ్రమ వెండి, 600 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం లభించాయి. అలాగే ఒక డాలర్ విలువైన రెండు అమెరికా డాలర్ల నోట్లు, 20 డాలర్ల విలువైన ఒక నోటు కలిపి మొత్తం మూడు విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో



సిరిసిల్లకు చెందిన శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, కొత్తకొండ శ్రీ సరస్వతి సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు లెక్కించి నమోదు చేశారు.

మద్యం మత్తులో మందుబాబుల వీరంగం

- సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీ చించివేత.. చిందరవందరగా మద్యం సీసాలు

భీమదేవరపల్లి ప్రజా నేస్తం జ్వాల నవంబర్ 03 :



భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్ మంగళపల్లి గ్రామపంచాయతీ ప్రాంగణంలో కొందరు మందుబాబులు హంగామా సృష్టించారు. సోమవారం రాత్రి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవించిన కొందరు వ్యక్తులు అక్కడ ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీని చించివేశారు. అంతేకాకుండా మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను గ్రామపంచాయతీ ప్రాంగణంలోనే చిందరవందరగా పడవేశారు. గ్రామ ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవిస్తూ, ప్రజాప్రతినిధుల ప్లెక్సీని ధ్వంసం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో కొందరు వ్యక్తులు తరచూ గందరగోళం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు స్పందించి గ్రామపంచాయతీ ప్రాంగణంలో మద్యం సేవించి హంగామా సృష్టించిన వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ధాన్యం నిల్వలో హెర్మెటిక్ బ్యాగులతో అధిక ప్రయోజనాలు

- మర్రికుంటలో రైతులకు అవగాహన కల్పించిన ఏలూరు వ్యవసాయ విద్యార్థినులు

గరిడేపల్లి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

పంట కోత అనంతరం ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవడంతో పాటు నిల్వ నష్టాలను తగ్గించేందుకు హెర్మెటిక్ బ్యాగుల వినియోగం ఎంతో ఉపయోగకరమని ఏలూరుకు చెందిన సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల వ్యవసాయ విద్యార్థినులు పేర్కొన్నారు. మర్రికుంట గ్రామంలో రైతులకు హెర్మెటిక్ బ్యాగుల వినియోగం, వాటి ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. హెర్మెటిక్ బ్యాగులు గాలి చొరబడని ప్రత్యేక నిల్వ సంచులని, వీటిలో ధాన్యాన్ని నిల్వ చేయడం వల్ల తక్కువ ఆక్సిజన్ వాతావరణం ఏర్పడి నిల్వ పురుగుల పెరుగుదల, వ్యాప్తిని నియంత్రించవచ్చని వివరించారు. వరి, బియ్యం, కందులు, పెసలు, మొక్కజొన్నతో పాటు వివిధ రకాల ఆహార ధాన్యాలు, విత్తనాలను వీటిలో భద్రపరుచుకోవచ్చని తెలిపారు.బ్యాగుల్లో ధాన్యాన్ని నింపిన అనంతరం గాలి చొరబడకుండా సక్రమంగా మూసివేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ పద్ధతి ద్వారా ధాన్యం నాణ్యతను కాపాడుకోవడంతో పాటు నిల్వ పురుగుల కారణంగా కలిగే నష్టాలను తగ్గించవచ్చని, రసాయన పురుగుమందులు, ఫ్యూమిగెంట్ల వినియోగంపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా విత్తనాల మొలకెత్తే సామర్థ్యాన్ని



కాపాడుకోవడంలోనూ ఇవి తోడ్పడతాయని వివరించారు.రైతులు సంప్రదాయ నిల్వ పద్ధతులతో పాటు ఆధునిక శాస్త్రీయ నిల్వ విధానాలపై అవగాహన పెంచుకుని హెర్మెటిక్ బ్యాగులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎన్. రామలింగయ్య, డి. మాన్సింగ్, ఎం. సైదయ్య, సి.హెచ్. నాగరాజు, కమల తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బీజేపీలోకి వలసల జోరు!

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తల చేరిక
- మేధావుల సదస్సులో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి

తిరుమలగిరి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

తుంగతుర్తి నియోజకవర్గ రాజకీయాల్లో బీజేపీ చేరికలు ఆసక్తికరంగా మారాయి. తిరుమలగిరి మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మేధావుల సదస్సు సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా చల్ల శ్రీలతారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, బీజేపీ సిద్ధాంతాలు, దేశ నిర్మాణంలో మేధావుల పాత్రపై వివరించారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పనిచేయాలని పిలుపునిచ్చారు.బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం జరిగిందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి



కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, నాయకులు బండ్లపల్లి పాండురంగ చారి, కంచర్ల నరసింహారెడ్డి, తీకుల సాయిరెడ్డి, మేడబోయిన యాదగిరి, వంగూరి రమేష్‌తో పాటు పలువురు న్యాయవాదులు, వైద్యులు, విద్యావేత్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు మండలాల్లో తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డిమాండ్!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో పార్టీ బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఎండిన పైర్లను పరిశీలించారు. అన్నదాతలను ఆదుకునేందుకు వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి మరియు మిర్చి పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు బారిన పడిన రైతాంగానికి బ్యాంకింగ్ రుణాలు రీషెడ్యూల్ చేసి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు.

బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తే సహించేది లేదు: మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ హెచ్చరిక!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



అధికార పార్టీ అండ చూసుకుని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ హెచ్చరించారు. వడ్డేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 35 ఏళ్ల రాజకీయ జీవితంలో పదవుల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యమిచ్చానని, కక్షసాధింపు చర్యలకు పాల్పడితే ప్రతిఘటిస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి సూచించారు. నగర అభివృద్ధిపై తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన సవాల్ విసిరారు.

ప్రైవేట్ పాఠశాలలు ప్రతినెలా హాజరు వివరాలు నమోదు చేయాల్సిందే: విద్యాశాఖ ఆదేశాలు!

హనుమకొండ, నవంబర్ 03 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని ఎప్పటికప్పుడు తప్పనిసరిగా ఐఎస్ఎంఎస్ (ISMS) పోర్టల్‌లో నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల హాజరు డేటాను తక్షణమే సమర్పించాలని ఆదేశించింది. కేంద్ర విద్యాశాఖ నిరంతరం రాష్ట్రాల హాజరు సమాచారాన్ని పర్యవేక్షిస్తున్నందున, ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నాటికి హాజరు నమోదును విధిగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

సన్నూరు వేంకటేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ!

- రూ.10 కోట్లతో పునర్నిర్మాణ పనులు.. వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలు

రాయపర్తి,నవంబర్3(ప్రజానేస్తం జ్వాల):



రాయపర్తి మండలం సన్నూరు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులతో చేపట్టిన పునర్నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆలయానికి నిత్యం విచ్చేసే భక్తుల సంఖ్య, వారి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, మిగిలిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.అంతకుముందు కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానానికి స్వగ్రామంలో ఆత్మీయ స్వాగతం!

- జనజీవన స్రవంతిలోకి వచ్చి ఐదు నెలలు.. కుటుంబంతో పెద్దపెండ్యాలకు చేరుకున్న మునిగాల రవి దంపతులు

ధర్మసాగర్, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



పీడిత ప్రజలకు సమన్యాయం సాధించాలనే ఆశయంతో, తాను నమ్మిన సిద్ధాంతమే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా స్వగ్రామమైన పెద్దపెండ్యాలను విడిచి ఉద్యమ బాటలో సాగిన మునిగాల రవి ఐదు నెలల క్రితం తిరిగి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. తాజాగా తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన పెద్దపెండ్యాలకు చేరుకోవడంతో గ్రామంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోట నాగరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మునిగాల రవి దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, వివిధ కుల సంఘాల పెద్దలు కలిసి శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా అభినందించారు.సుదీర్ఘ కాలం తర్వాత స్వగ్రామానికి కుటుంబంతో సహా తిరిగి వచ్చిన రవి దంపతులను గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతాం!

- **ప్రతి ఫిర్యాదును నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: ఎస్ఈ పి. యాదగిరి**
- **సూర్యాపేటలో ఘనంగా విద్యుత్ వినియోగదారుల దినోత్సవం**

సూర్యాపేట, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఆపరేషన్) పి. యాదగిరి తెలిపారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు అందజేసిన ప్రతి ఫిర్యాదును అధికారికంగా నమోదు చేసి, సంబంధిత సమస్యపై ఫిర్యాదుదారులకు నేరుగా సమాచారం అందిస్తామని స్పష్టం చేశారు.ప్రస్తుత ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో విద్యుత్ వనరుల ప్రాధాన్యత మరింత పెరిగిందని, విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. అనవసరంగా విద్యుత్ వినియోగించకుండా దుర్వినియోగాన్ని అరికట్టాలని కోరారు. ప్రభుత్వ సహకారంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ వేదికలో పలువురు వినియోగదారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ స్తంభాలు వేయాలని, గృహ విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిర్యాదులు అందజేశారు. స్పందించిన ఎస్ఈ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ టెక్నికల్ ఇంజనీర్ వెంకటకృష్ణ, ఎస్ఏఓ సత్యనారాయణ, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది, పలువురు విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడి.. శాస్త్రీయ ఆలోచనలు అలవర్చుకోవాలి!

- **విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, పరిశోధనాత్మక దృక్పథం పెంపొందించడమే చెకుముకి సంబరాల లక్ష్యం: ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్**

గరిడేపల్లి, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రశ్నించే తత్వం, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించడమే చెకుముకి సైన్స్ సంబరాల ముఖ్య ఉద్దేశమని గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ అన్నారు.జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను మంగళవారం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలని, ప్రశ్నించడం, ప్రయోగించడం ద్వారా వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు నిత్యజీవితంలో ఎదురయ్యే అంశాలపై పరిశోధనాత్మక అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కలకుంట్ల సైదులు మాట్లాడుతూ చెకుముకి సంబరాలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. విజ్ఞానాన్ని సమాజానికి చేరువ చేయడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విద్యా సబ్ కమిటీ సభ్యులు చేపూరి నరసింహారావు, శాస్త్ర సమాజ సబ్ కమిటీ సభ్యులు జక్కుల లక్ష్మణ్, సాంస్కృతిక సబ్ కమిటీ సభ్యులు బుర్ర వీరయ్య, అసిస్టెంట్ సెక్రటరీ ఎల్. చిన్నబాబు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ పరిచయంతో సైబర్ వల.. కానిస్టేబుల్‌కు రూ.29.20 లక్షల టోకరా!

- **ట్రేడింగ్‌లో భారీ లాభాల ఆశ చూపి మోసం.. రూ.76 లక్షల లాభం వచ్చిందంటూ మరో రూ.12 లక్షల డిమాండ్**

హైదరాబాద్, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



సోషల్ మీడియా పరిచయం సైబర్ మోసానికి దారితీసింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరుతో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌ను మోసం చేసి ఏకంగా రూ. 29.20 లక్షలు కాజేసింది.వివరాల్లోకి వెళితే.. బాధిత కానిస్టేబుల్‌కు ఫేస్‌బుక్‌లో 'సుకన్య రెడ్డి' పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అనంతరం వాట్సాప్‌లో పరిచయం పెంచుకున్న మహిళ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. 'డార్విన్ ఎక్స్ గ్లోబల్' సంస్థలో మొదట కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టించగా, లాభాలు వచ్చినట్లు చూపించి బాధితుడి నమ్మకాన్ని పొందింది.దీంతో ఆమె మాటలు నమ్మిన కానిస్టేబుల్ విడతలవారీగా మొత్తం రూ. 29.20 లక్షలు పెట్టుబడిగా జమ చేశాడు. అనంతరం తన ఖాతాలో రూ.76 లక్షల లాభం వచ్చిందని, ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలంటే ముందుగా రూ.12 లక్షల ఫీజు చెల్లించాలని అవతలి వ్యక్తులు డిమాండ్ చేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.అపరిచితుల సోషల్ మీడియా పరిచయాలు, అధిక లాభాల ఆశ చూపే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

ఫ్లోరైడ్ భూతం నుంచి మునుగోడుకు శాశ్వత విముక్తి.. డిండి ఎత్తిపోతలే పరిష్కారం!

- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలి**
- **300 చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక.. రైతులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

మునుగోడు, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):



ఫ్లోరైడ్ సమస్యతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునుగోడు నియోజకవర్గానికి డిండి ఎత్తిపోతల పథకమే శాశ్వత పరిష్కారమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.వికసిత్ భారత్ – జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నల్లగొండ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, కరువు నివారణ చర్యలపై మునుగోడులోని క్యాంపు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పలు కీలక అంశాలపై మాట్లాడారు.

డిండి ఎత్తిపోతలతోనే ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం

మునుగోడు నియోజకవర్గం ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమని, ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడం అత్యంత అవసరమని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం రిజర్వాయర్ల నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలనే విషయంలో స్పష్టత లేక పనులు ముందుకు సాగలేదని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత నాయకులతో చర్చించి ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏదుల రిజర్వాయర్ నీటి మట్టాలకు సంబంధించి ఎదురైన సమస్యలను కూడా పరిష్కరించుకున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్, వనపర్తి ప్రాంతాల ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలతో చర్చించి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

300 చెరువుల అభివృద్ధికి ప్రణాళిక

వర్షపు ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలనే లక్ష్యంతో నియోజకవర్గవ్యాప్తంగా 300 చెరువులను గుర్తించి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినప్పటికీ, అవసరమైన నిధులు ఇంకా మంజూరు కాలేదని తెలిపారు.చెరువుల పునరుద్ధరణ, చిన్న నీటి వనరుల పరిరక్షణకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాబోయే వర్షాకాలానికి ముందే చెరువుల అభివృద్ధి పనులు చేపట్టి వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గ రైతులకు తగిన పరిహారం అందించేలా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో రైతులకు ఆశించిన ఆదాయం రావడం లేదని, సేంద్రియ పద్ధతుల్లో వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించి అంతర్జాతీయ మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తే రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

నిధుల కేటాయింపుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి

కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ఖర్చు చేసిన ప్రభుత్వం ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న మునుగోడు ప్రాంతంలోని చెరువుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తున్నానని, అయితే ప్రతిపాదించిన పనులకు తగిన నిధులు అందడం లేదని పేర్కొన్నారు.తాను మంత్రి లేదా ముఖ్యమంత్రి కాకపోయినా నియోజకవర్గ అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నానని అన్నారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, యాదాద్రి, నల్లగొండ జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, మునుగోడు నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీల అధికారులు, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి ఐడియల్ కంపెనీలో భారీ బ్లాస్టింగ్ ప్రమాదం!

నల్లగొండ, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

నల్లగొండ జిల్లాలో బ్లాస్టింగ్ ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి గ్రామంలోని ఐడియల్ కంపెనీలో జరిగిన బ్లాస్టింగ్ ఘటనలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు భవనంలోని కొన్ని భాగాలు ధ్వంసమై శకలాలు చెల్లాచెదురుగా పడినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, మరొకరికి కామినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.బాధితుల్లో ముగ్గురు ఒడిశా రాష్ట్రానికి చెందినవారిగా, మరొకరు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. బ్లాస్టింగ్ సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించారా? ప్రమాదానికి దారితీసిన పరిస్థితులేమిటి? అనే కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్మిక హిందీ యాసపై విమర్శలు.. అండగా నిలిచిన బాలీవుడ్ నటి

హిందీలో దక్షిణాది నటుల యాసపై ట్రోలింగ్ సరికాదన్న కషికా కపూర్
నటులను నటన ఆధారంగా చూడాలి, భాష అడ్డంకి కాకూడదని వ్యాఖ్య
రష్మిక మందన్న లాంటి నటిని యాస పేరుతో విమర్శించడం తగదని హితవు
పనితీరుకే విలువివ్వాలి కానీ యాసతో జడ్జ్ చేయకూడదని స్పష్టం



బాలీవుడ్‌లో పనిచేసే దక్షిణాది నటీనటులు వారి హిందీ యాస (యాక్సెంట్) కారణంగా తరచుగా విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కోవడంపై యువ నటి కషికా కపూర్ స్పందించారు. నటులను వారి నటన ఆధారంగా చూడాలని, భాష లేదా యాస ఎప్పటికీ అడ్డంకి కాకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు."హిందీ చిత్రాల్లో పనిచేసే దక్షిణాది నటుల యాసపై విమర్శలు వస్తుంటాయి, దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?" అని అడగగా, కషికా బదులిస్తూ.. "ఇలా జరగడం చూస్తూనే ఉన్నాం. కానీ ఒక నటుడిని/నటిని అంతిమంగా నటన ఆధారంగానే గుర్తించాలి. భాష అనేది ఎప్పటికీ అవరోధం కాకూడదు. ఇది తెలుగు చిత్ర పరిశ్రమ, ఇది హిందీ చిత్ర పరిశ్రమ అని మనం విడదీయకూడదు" అని స్పష్టం చేశారు.గతంలో 'కాఫీ విత్ కరణ్' షోలో నటి రష్మిక మందన్న కూడా తన కెరీర్‌లో యాస విషయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని వెల్లడించిన సంగతి తెలిసిందే. దక్షిణాదికి చెందిన దానిని కావడం వల్ల తన హిందీ యాస సహజంగానే అలా వస్తుందని, అయినా ఆ విమర్శలకు భయపడి తాను వేర్వేరు భాషల్లో పనిచేయడం ఆపనని ఆమె తెలిపారు.ఈ నేపథ్యంలో రష్మిక ఉదాహరణను ప్రస్తావిస్తూ కషికా మాట్లాడారు. "ఉదాహరణకు రష్మిక మందన్నను తీసుకోండి. ఆమె ఒక అద్భుతమైన నటి, పెర్ఫార్మర్. ఆమెను యాస లేదా భాష ఆధారంగా జడ్జ్ చేయడం సరైంది కాదు. అది ఆమె గుర్తింపులో ఒక భాగం. ఆమె మూలాలు అక్కడివి. 'యానిమల్' లాంటి భారీ చిత్రాల్లో నటించి గొప్ప పనితీరు కనబరిచారు. నటులను వారి యాసను బట్టి కాకుండా, వారి ప్రతిభను చూసి అభినందించాలి" అని కషికా కపూర్ తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు.

సూర్యాపేట జిల్లాపై మురసు తుఫాన్ పంజా!

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాల హెచ్చరిక.. కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లకు ప్రత్యేక అప్రమత్తత
అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దు.. ప్రయాణాలు వాయిదా వేసుకోండి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, నవంబర్ 3 (ప్రజానేస్తం జ్వాల):

మురసు తుఫాన్ ప్రభావంతో సూర్యాపేట జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజలను అప్రమత్తం చేశారు. రాబోయే కొన్ని గంటలు కీలకమని, ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలో భారీ వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముందుగా నిర్ణయించుకున్న అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.తుఫాన్ ప్రభావిత పరిస్థితుల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాల సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజు, డీపీఓ యాదగిరి, డీఎస్ఓ మోహనబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.